నమస్తే తెలంగాణ
తెలంగాణ జైత్రయాత్ర 2023
హైదరాబాద్ | శుక్రవారం 24 నవంబర్ 2023 www.ntnews.com

కాంగ్రెసొస్తే రైతుల పంట ఎండుడ్డి
మెకానిక్‌ల పంట పండుడ్డి
ఎవుసానికి తప్పదు ఉరి
రైతన్నలకు చావు తప్పదు మరి
కాడి వదిలి కాటికి పోవుడే
కష్టాల పాలై కాష్టంలో కాలిపోవుడే
కాంగ్రెస్‌కు ఓటేసి ఆగం కావొద్దు
తెలంగాణను ఆగం చేయొద్దు

-మాలోతు సురేష్

**91827 77222**
హ్యాట్రిక్ ఎలక్షన్- హ్యాట్రిక్ కేసీఆర్ కాన్సెప్ట్‌తో అసెంబ్లీ ఎన్నికల స్పెషల్ 'తెలంగాణ జైత్రయాత్ర'కు మీ నినాదాలు పంపాల్సిన వాట్సాప్ నెంబర్ ఇదీ.. మీ పేరు పంపడం మర్చిపోకండి.

## నాడు-నేడు

- లక్నవరానికి శాపం



ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సంపదపై మూకుమ్మడి దాడి జరిగిందనడానికి లక్నవరం సరస్సుకు పట్టిన గ్రహణమే ఉదాహరణ. కాకతీయ రాజు ప్రతాపరుద్రుడి హయాంలో నిర్మితమైన ఈ అద్భుత సరస్సు కింద సుమారు 8,700 ఎకరాల ఆయకట్టు ఉండేది. ప్రకృతి అందాల నడుమ అక్షయమైన జల సంపత్తితో ఇది అలరారేది. కానీ, అప్పటి ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి లక్నవరానికి శాపంగా పరిణమించింది. సరస్సు బాగోగులు గాలికొదిలారు. పర్యాటకంగానూ చిన్నచూపు చూశారు.

- విహారానికి వరం



తెలంగాణ ఆవిర్భావంతో నీటి చెలమలన్నీ నిండు కుండలయ్యాయి. నేడు లక్నవరం మినీ సంద్రాన్ని తలపిస్తున్నదంటే ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవే కారణం. 2017లో రూ.5కోట్లతో లక్నవరం సరస్సుపై ప్రభుత్వం రెండో తీగల వంతెన కట్టించింది. సరస్సులో ఉన్న రెండో ద్వీపాన్ని, మూడో ద్వీపాన్ని అనుసంధానం చేస్తూ 2021లో రూ.2 కోట్లతో మరో తీగల వంతెనను ఏర్పాటు చేసింది. సౌకర్యాలూ మెరుగవడంతో వారాంతం వచ్చిందంటే.. పర్యాటక ప్రియులు చలో లక్నవరం అంటున్నారు.

ఫన్‌టాస్టిక్

## చుడువ పొట్లం మ్యానిఫెస్టో

'ఎలా ఉందంటున్నారు? మన మ్యానిఫెస్టో... దుమ్ము దులిపేస్తుంది కదా?'

'ఔను సార్... ట్యాంక్ బండ్ దగ్గర ఎక్కడ చూసినా మన మ్యానిఫెస్టో పుస్తకాలే కనిపిస్తున్నాయ్. ఎవరి చేతిలో చూసినా ఆ పుస్తకంలోని పేజీలే ...'

'ట్యాంక్ బండ్‌పై మీటింగ్ ఏమీ లేదే... అలా ఎలా?'

'మీటింగ్ కాదు. ట్యాంక్ బండ్ మీద చుడువ చాలా ఫేమస్. చుడువ అమ్మే వాళ్లకి పొట్లం కట్టేందుకు మన మ్యానిఫెస్టో పుస్తకం బాగా ఉపయోగపడుతున్నది. ఐనా అదే సంతోషం లెండి'

'అదేంటోయ్ మన హామీలు బాగా లేవా?'

'బాగా లేక పోవడం కాదు, మన మీద నమ్మకం లేదు'

'ఎందుకలా?'

'యూపీఏ హయాంలో ఇచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్ట్‌ను గుజరాత్‌కు తరలించాం. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ అటకెక్కించాం. అన్ని రాష్ట్రాలకు జాతీయ ప్రాజెక్టు ఇచ్చి తెలంగాణకు మొండిచేయి చూపించాం. నవోదయ పాఠశాల కానీ, మెడికల్ కాలేజీలు కానీ ఇవ్వడంలో తెలంగాణ అనగానే మనకు చేతులు రావడం లేదు. ఢిల్లీలో పదేండ్లు అధికారంలో ఉండి ఏమీ ఇవ్వని వాళ్ళం, ఇప్పుడు ఏదో ఇస్తాం అని మ్యానిఫెస్టోలో పెడితే చుడువ కట్టే పొట్లానికి తప్ప దేనికీ పనికి రాదు అంటున్నారు'

'దానిదేముందోయ్... ఈ మ్యానిఫెస్టో నమ్మకపోతే కమలం రెండో మ్యానిఫెస్టో విడుదల చేద్దాం.



ఐడియా బాగుంది. చిన్నప్పుడు వంద రోజులు సినిమా నడిచే కాలంలో సినిమా తన్నేస్తుంది అనుకుంటే, రెండు వారాలు గడిచాక ఇంకో పాటను సినిమాలో చేర్చేవారు. అక్కినేని సెక్రెటరీ సినిమాలో ఇలా పాట చేర్చినట్టు గుర్తు'

'సరే... జనం నమ్మాలి అంటే కొత్త మ్యానిఫెస్టోలో ఏముండాలో చెప్పు?'

'ఇప్పటి వరకు మనం తెలంగాణకు ఏమీ ఇవ్వలేదు కాబట్టి, ఏమిస్తామన్నా నమ్మరు. నమ్మాలి అంటే ఇస్తాం అని కాదు. లాగేసుకుంటాం అని చెప్పాలి.

ఏం లాగేసుకుంటాం?'

'చార్మినార్‌ను గుజరాత్‌కు, హైటెక్ సిటీని ఉత్తర్ ప్రదేశ్‌కు, యాదాద్రిని మహారాష్ట్రకు తరలిస్తాం అని చెప్పాలి'

'కమలం వికసించడానికి సలహాలు ఇమ్మంటే, నువ్వేంటోయ్ కర్ణుడికి సారథ్యం వహిస్తూనే సూటి పోటి మాటలు అన్న శల్యుడిలా... అలా చెబుతావేం. ఉపాయం చెప్పు'

'ప్రతి ఒక్కరి ఖాతాలో 15 లక్షలు... '

'ఇది పాత ఐడియానే. ఈ మాట చెప్పే కదా... మోడీ ఓట్లు కొల్లగొట్టింది.'

'నేను పూర్తిగా చెప్పక ముందే మధ్యలోనే అడ్డు తగిలావు. ప్రతి ఖాతాలో 15 లక్షలు వేస్తామని చెప్పినా ఎవరూ నమ్మరు నాకా సంగతి తెలుసు'

'మరి?'

'పదిహేను లక్షలు వేస్తామని చెప్పడం కాదు. ఎన్నికలకు ముందే ప్రతి ఖాతాలో పదిహేను లక్షలు వేయాలి. అప్పుడు కానీ మన మాట నమ్మరు. పదేండ్లలో తెలంగాణకు ఏమిచ్చారు అని చూస్తారు'

'అప్పుడు నమ్ముతారు అంటావా?'

'గ్యారంటీ లేదు. అవకాశం ఉంది. ఏం చేస్తాం... అదీ మన క్రెడిబులిటీ..!'

■ మురళి

# గోదావరి.. జలతోరణం

## శ్రీరాంసాగర్ టూ సీతమ్మసాగర్
## సీఎం కేసీఆర్ అపూర్వ సృష్టి

**400 కి.మీ సజీవధార • నది గర్భంలోనే 80 టీఎంసీలు**

> పడ్డ చినుకు పడ్డట్లుగనే.. వచ్చిన వరద వచ్చినట్టే..
> దిగువకు జలజలా జారిపోవుడే.. సంద్రంపాలు కావడమే..
> నీళ్ల మురిపమూ మూణ్నాళ్ల ముచ్చటే..
> వానలు కురిసిన నాలుగొద్దులె.. గోదారంతా ఎడారే..
> ఇదీ నిన్నటి గతం.. చేదు నిజం..

గలగలా గోదావరి

నేడు గోదావరి తీరమొక జలదృశ్యకావ్యం.
ఈ దరి నుంచి ఆ దరికి మధ్యన ఓలలాడుతూ..
ఈ మూల నుంచి చివరి మూల వరకు 400 కి.మీ. తుళ్లిపడుతూ..
గోదావరి గుండెనిండుగా కనుచూపు మేర కనువిందు చేసే జలతోరణం..
తీరం లోలోపలే ఒదిగి ఒదిగి పారుతూ మైమరిపిస్తున్నది.
ఇది కాకతీయుల గొలుసుకట్టు విధాన స్ఫూర్తితో సీఎం కేసీఆర్ ఆవిష్కరించిన అద్భుతం.. పదేండ్ల ఆచరణకు దక్కిన జలఫలం..



... మ్యాకం రవికుమార్

కాకతీయులు అనగానే జలసాధనకు వారు పాటించిన గొలుసుకట్టు విధానం గుర్తుకొస్తుంది. నీటి ఊట, గుట్టలు ఎక్కడ ఉంటే అక్కడ చెరువులు తవ్వారు. ఒక చెరువుతో మరో చెరువును లంకెపెట్టారు. జలాలను ఒడిసిపట్టి పొలాలకు మళ్లించారు. ఇప్పటివరకు చెరువులకే పరిమితమైన ఆ విధానాన్ని అపర భగీరథుడు సీఎం కేసీఆర్ మరో మెట్టు పైకి తీసుకెళ్లారు. భారీ ప్రాజెక్టుల్లోనూ గొలుసుకట్టు విధానాన్ని అమలు చేస్తూ అద్భుత జలదృశ్యాలను ఆవిష్కరిస్తున్నారు. కాకతీయుల స్ఫూర్తితో.. బీళ్ల దాహార్తిని తీర్చేందుకు బాటలు వేస్తూ ఎడారిలా మారిన గోదారిని తెలంగాణ నఖశిఖ పర్యంతం సజీవధారగా తీర్చిదిద్దారు. సీఎం కేసీఆర్ దార్శనికతతో గోదావరి పొడవునా నిర్మించిన వరుస బరాజ్‌లు సరికొత్త జలదృశ్యాలను ఆవిష్కరిస్తున్నాయి. గోదావరి నదిపైనే కాకుండా దాని ఉపనదులైన మానేరు, మంజీరా, వాగులు, వంకలపైనా వరుస చెక్‌డ్యాంలను నిర్మిస్తున్న ఫలితంగా తెలంగాణ నేడు జలభాండాగారంగా రూపుదిద్దుకుంటున్నది.

ప్రస్తుతం గోదావరిలో నీటి నిల్వ టీఎంసీలు ..


| ప్రాజెక్టు | నీటినిల్వ (టీఎంసీలు) | బ్యాక్‌వాటర్ (కి.మీ) |
|---|---|---|
| ఎస్సారెస్పీ | 90 | 74 |
| సదర్‌మాట్ | 1.58 | 17 |
| ఎల్లంపల్లి | 20 | 36 |
| అన్నారం | 10.87 | 32 |
| సుందిళ్ల | 8.83 | 31 |
| మేడిగడ్డ | 16.17 | 42 |
| సమ్మక్కసాగర్ | 6.94 | 30 |
| సీతమ్మసాగర్ (నిర్మాణంలో ఉన్నది) | 37 | 115 |
| మొత్తం | 191.39 | 377కి.మీ. |

### 400 కిలోమీటర్ల పొడవునా..

గోదావరి నది నిజామాబాద్ కందకుర్తి నుంచి ఖమ్మం జిల్లా బూర్గంపాడు వరకు 644 కిలోమీటర్లు తెలంగాణలో ప్రవహిస్తున్నది. సమైక్య పాలనలో నిర్మించిన రిజర్వాయర్లు రెండే. వాటి సామర్థ్యం మొత్తంగా 110 టీఎంసీలు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత సీఎం సుదీర్ఘ మేధోమథనం సాగించి శ్రీకారం చుట్టిన కాళేశ్వరంతో గోదావరి రూపురేఖలే మారిపోయాయి. మొత్తంగా 400 కిలోమీటర్ల గోదావరి సజీవం అవుతున్నది. ఎస్సారెస్పీ దిగువన 37 కిలోమీటర్ల సదర్‌మాట్, దాని దిగువన 143.5 కి.మీ వద్ద ఎల్లంపల్లి, 29.49 కి.మీ వద్ద పార్వతీ బరాజ్, 31.74 కి.మీ వద్ద సరస్వతీ, 45.87 కి.మీ వద్ద లక్ష్మీ బరాజ్, 46.37 కి.మీ వద్ద సమ్మక్క బరాజ్‌ను నిర్మించారు.

సజీవంగా గోదావరి

ఒక బరాజ్ వద్ద నిల్వ చేసిన నీరు మరో బరాజ్‌ను తాకే విధంగా నిర్మించడం విశేషం. నదీ తీరంలోపలే నీరు నిలిచేలా డిజైన్ చేయడం మరో విశేషం. ఫలితంగా శ్రీరాంసాగర్ నుంచి సీతమ్మసాగర్ వరకు గోదావరి నది మొత్తం తీరం పరిధిలోనే నిత్యం సజీవంగా మారుతున్నది. సీతమ్మసాగర్ మినహా, అన్ని నిర్మాణాలు పూర్తికాగా, 274 కి.మీ.ల నది సజీవంగా మారింది. సీతమ్మసాగర్ కూడా పూర్తయితే మరో 115 కి.మీ.ల మేర జలకళ రానున్నది. తెలంగాణలో ప్రవహిస్తున్న మొత్తం పొడవులో 62.11% సజీవంగా నిలువనున్నది. అదీ గాక మొత్తంగా గోదావరిలోనే 171.19 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉన్నది.




### నదీగర్భ జలాశయాలతో ఒనగూరుతున్న ప్రయోజనాలు

- హైడ్రాలజికల్ సైకిల్ ప్రకారం.. నీరు ఆవిరై తిరిగి వర్షంగా కురుస్తుంది. వర్షపాతం సమృద్ధిగా ఉండాలంటే అందుకు ప్రధానంగా కావాల్సింది నీరే. ఎంత మేరకు నీటి నిల్వ సామర్థ్యం ఉంటే ఆ మేరకు వర్షపాతం ఉంటుంది. నదీగర్భ జలాశయాలతో వర్షపాతం పెరుగుతుంది.
- సుదీర్ఘకాలం పాటు నీరు ప్రవహించకుంటే నదీ తీరాలు కుచించుకుపోయి, వరద వస్తే కోతకు గురవుతాయి. అలా కాకుండా ఉండాలంటే నదిలో నిరంతరం ఎంతో కొంత నీరు ప్రవహిస్తుండాలి. అందుకు ప్రభుత్వం నిర్మించిన నదీగర్భ జలాశయాలు ఎంతో దోహదం చేస్తాయి. నదీ తీరం కుచించుకుపోకుండా, వరద వచ్చినా తీరం కోతకు గురి కాకుండా కాపాడుతాయి.
- గోదావరి తీరం వెంట ఇరువైపులా అటవీ పరచుకుని ఉన్నది. ప్రస్తుతం జలాలు కూడా నిల్వ ఉండడం వల్ల ఆ ప్రాంతం మొత్తంగా ఎకో టూరిజం స్పాట్‌గా మారుతున్నది. తద్వారా పర్యాటకరంగం విస్తరిస్తున్నది.
- భూగర్భ జలాల పెరుగుదలకు ఎంతో దోహదపడతాయి. నిల్వ చేసుకున్న సుమారు 200 టీఎంసీలను వినియోగించుకోవచ్చు. గోదారివరి నది పొడవునా, చుట్టూ 100 కి.మీ.ల మేర భూగర్భ జలాలు పెరుగుతాయి. తద్వారా అదనంగా మరో 50 టీఎంసీలను కూడా వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుంది. తాగునీటి, పారిశ్రామిక నీటి అవసరాలకు కూడా కొరత ఉండదు.
- ప్రస్తుతం సమ్మక్కసాగర్, సీతమ్మసాగర్ వద్ద హైడల్ ప్రాజెక్టులను ప్రభుత్వం ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఇవి పూర్తయితే కేవలం వానలు కురిసినప్పుడు, వరదలు వచ్చినప్పుడు మాత్రమే కాకుండా నిరంతరాయంగా జలవిద్యుత్ ఉత్పత్తికి అవకాశముంటుంది. తక్కువ ఖర్చుతో విద్యుత్ అందుబాటులోకి వస్తుంది.
- మంచినీటి మత్స్య పరిశ్రమ అభివృద్ధి చెందుతున్నది.
- భవిష్యత్‌లో లాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకున్నట్లయితే గోదావరిలో దాదాపు 400 కి.మీ.ల మేర జల రవాణాకు కూడా అవకాశముంటుంది. అతితక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో సరుకులను తరలించే అవకాశముంటుంది.

హమారా హైదరాబాద్..



## పెట్టుబడులకు కేరాఫ్ ఓఆర్ఆర్

- ఓఆర్ఆర్ చుట్టూ భారీ ప్రాజెక్టులు
- కోర్‌సిటీని మించి డెవలప్‌మెంట్

ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) అభివృద్ధికి కేరాఫ్‌గా మారింది. కోర్‌సిటీని మించి ఓఆర్ఆర్ చుట్టూ అభివృద్ధి జరుగుతున్నది. భారీ ప్రాజెక్టులు, ఆకాశహర్మ్యాలు, అంతర్జాతీయ కంపెనీలతో ఓఆర్ఆర్ చుట్టు పక్కల ప్రాంతాల రూపురేఖలే మారిపోయాయి. 10-59 అంతస్థుల వరకు ఎత్తయిన ఆకాశహర్మ్యాలను నిర్మిస్తున్నాయి. ఇంటర్‌చేంజ్‌ల నుంచి కోర్ సిటీ, జిల్లా కేంద్రాలు, ఇతర రాష్ట్రాల నుంచి రాకపోకలు అత్యంత సులభంగా సాగించేలా ప్రభుత్వం రోడ్ల నిర్మాణం చేపడుతుండటంతో, ఆ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు కేంద్రంగా నగరాభివృద్ధి పరుగులు పెడుతున్నది. మణిహారంలా మారిన 158 కిలోమీటర్ల ఓఆర్ఆర్ చుట్టూ భూములు అందుబాటులో ఉండటంతో ప్రైవేటు కంపెనీలు భారీ ప్రాజెక్టులు చేపడుతున్నాయి. తొమ్మిదేండ్లలో ప్రభుత్వం ఓఆర్ఆర్ నుంచి కోర్ సిటీకి రోడ్లను అనుసంధానం చేసింది. పడమర దిక్కున ఉన్న ఐటీ కారిడార్‌తో పాటు నలు దిక్కులా కొత్త ప్రాజెక్టులు వచ్చేలా చర్యలు తీసుకున్నది. దీంతో నివాస, వ్యాపార సముదాయాలతో పాటు ఫార్మా, లైఫ్‌సైన్సెస్, డిఫెన్స్, ఏరోస్పేస్, వైద్య పరికరాలు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహన రంగాలకు చెందిన పరిశ్రమలు ఔటర్ చుట్టూ భారీగా ఏర్పాటయ్యాయి. వేగంగా విస్తరిస్తున్న నగరం, అభివృద్ధి, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఓఆర్ఆర్ చుట్టూ మరో మూడుచోట్ల (నార్సింగి, కోకాపేట, మల్లంపేట) ఇంటర్‌చేంజ్‌లను నిర్మించింది. ప్రభుత్వ చర్యలతో మహేశ్వరం, తుక్కుగూడ, కొంగరకలాన్ ప్రాంతాల్లో ఫ్యాబ్ సిటీ, ఈ-సిటీ వంటివి రాగా, ముచ్చర్ల సమీపంలో దేశంలోనే అతి పెద్దదైన ఫార్మా సిటీ నిర్మాణం జరుగుతున్నది.

... శేఖర్